క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలిరూరల్: రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచన మేరకు తెనాలి విద్యుత్ డీ3 సెక్షన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పి. వెంకటసుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జయప్రకాష్‌నగర్, వీఎస్సార్ కళాశాల రోడ్డు, బస్టాండ్ ఏరియాలో ఉదయం ఏడు గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామన్నారు. చెట్ల కొమ్మలు తొలగించాల్సి ఉండడంతో సరఫరా నిలిపివేయాల్సి వస్తోందని, ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు



తెనాలిఅర్బన్: విజయదశమిని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం డిపో సెంటర్‌లో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, చినరావూరు పార్కులో పనిచేసే వారికి నూతన వస్త్రాలు, బిర్యానీ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న 34వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, జనసేన నాయకులు జిడుగు తులసీలు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నుంచి గుంటూరు కోటేశ్వరరావు మున్సిపల్ కార్మికులు 60 మందికి వీటిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కుక్కల వాసు, సురుపుల వెంకట్రావు, సుంకర కొండలరావు, మేడేపల్లి ప్రభాకర్, ధరణికోట మల్లికార్జునరావు, శివారెడ్డి, రాజా, మనోజ్, బాబి, తోట ఫణి, మామిడాల సుమన్, 15వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకోండి



తెనాలిఅర్బన్: వాహనాల రాకపోకలకు ఇబ్బందులు రాకుండా వ్యాపారాలు చేసుకోవాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నజీర్ సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి ఆదేశాల మేరకు బస్టాండ్ ఎదురు రోడ్డుపై చేపలు, రొయ్యలు, పీతల వ్యాపారాలు జరిగే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. రోడ్డుపై ఆటోలను ఉంచి వ్యాపారాలు చేయటం వల్ల అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపిస్తామని అందులో వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. అలాగే వ్యాపారాలు చేసుకునే వారి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ ఆరోగ్య విభాగ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం



తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులో క్లాసిక్ స్పోర్ట్స్ ఎరీనా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం సాయంత్రం పట్టణానికి చెందిన వైద్యుడు, మైత్రీ హాస్పటల్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆలపాటి కృష్ణసందీప్ ప్రారంభించారు. ఈ టోర్నమెంటు 13, 14, 15 తేదీల్లో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15 వేలు, రూ.8 వేలు, 4 వేలు, మాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రతి టీమ్‌కు రూ.వెయ్యి ఇస్తామని తెలియజేశారు. షేక్ షమీర్, షేక్ అమిర్ సోహేల్, షేక్ అమిర్ షకీల్, మావులూరి రేవంత్, షేక్ సమీర్, తరుణ్, అక్షయ్, చాణక్య పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు

తాడేపల్లిరూరల్ : మహమ్మద్ ప్రవక్త, పవిత్ర గ్రంథం ఖురాన్‌పై ఉత్తరప్రదేశ్‌కు చెందిన యతి నర్సింగ్ నంద అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకులు షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరమత సహనంతో మెలిగే భారతదేశంలో కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి పల్లె పండుగ

తాడేపల్లిరూరల్ : పెదకొండూరు, వీర్లపాలెం, గొడవర్రు గ్రామాల్లో సోమవారం పల్లె పండుగను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ అభివృద్ధికి తీర్మానం చేయబడుతుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.



తెనాలి ఉప్పుబజారు కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు



శివాజీచౌక్ కాళీమాత ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ



పూజల్లో మాజీ ఎమ్మెల్యే శివకుమార్ దంపతులు



అయితానగర్ డాంగేవీధిలో పూజల్లో మాజీ ఎమ్మెల్యే శివకుమార్



శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఊరేగింపు



చెంచుపేట గోదా పద్మావతిదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అష్టోత్తర శతకలశాభిషేకం

వైభవం.. దసరా పర్వదినం

విజయదశమి పర్వదినం శరన్నవరాత్రులు పట్టణంలో వైభవంగా ముగిశాయి. పండుగ రోజున అమ్మవారిని వివిధ దేవాలయాల్లో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం పలు దేవాలయాల్లో అమ్మవారి ఊరేగింపు, అన్నప్రసాదవితరణ చేశారు. పలుచోట్ల జరిగిన పూజాకార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. – తెనాలి



ఎరుకలపూడి గ్రామం శివబాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కోలాట భజన

ఫ్లెక్సీ రహితమా.. ఎక్కడ?!

- తెనాలి పట్టణంలో ఎటుచూసినా వాల్‌పోస్టర్‌లు, ఫ్లెక్సీలే
- మాటలకే పరిమితం అయిన ఫ్లెక్సీ, పోస్టర్ రహిత పట్టణం హామీ
- ఆదాయాన్ని కోల్పోతున్న మున్సిపాలిటీ



మున్సిపల్ కార్యాలయం ముందు మార్కెట్ భవనంపై ఉన్న ఫ్లెక్సీలు



మార్కెట్‌కు వచ్చే ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన అనధికార ఫ్లెక్సీలు

తెనాలిఅర్బన్:తెనాలి పట్టణాన్ని పోస్టర్, ఫ్లెక్సీ రహిత పట్టణంగా తీర్చిదిద్దుతామని తరచూ మున్సిపల్ అధికారులు చెప్పేమాట. కానీ ఆచరణలో మాత్రం అది కన్పించటంలేదు. పట్టణంలో ప్రధాన రహదారులపై అనధికార ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న వాటిపై చర్యలు నేటికి తీసుకోకపోవటం పలు విమర్శలు వినిపిస్తున్నాయి. తెనాలి పట్టణం జిల్లాలో గుంటూరు తర్వాత పెద్ద ప్రాంతంగా పేరుంది. ఇక్కడ సుమారు రూ.1.65లక్షల జనాభా నివశిస్తుంటారు. అంతేకాకుండా తెనాలి డివిజన్ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వారు వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు, పిల్లల చదువుల నిమిత్తం పట్టణంలో ఎక్కువ మంది నివశిస్తుంటారు. అంతేకాకుండా వివిధ పనుల నిమిత్తం, ఉద్యోగాల నిమిత్తం ఇక్కడికి ప్రతిరోజు వేల మంది వస్తుంటారు. దీంతో తెనాలి పట్టణం ప్రతి ఏడాది విస్తరిస్తూ వస్తోంది. ఇలాంటి తెనాలిలో యాడ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలంటే మున్సిపాలిటీ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ముందుగా సదరు యాడ్ ఏజెన్సీల నిర్వాహకులు రోడ్ల వెంట ఏర్పాటు చేసుకోవాలంటే స్థలాన్ని చూసుకుని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలియజేయాలి. వారు అనుమతి ఇస్తే అక్కడ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. బోర్డును బట్టి నగదు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ స్థలంలో అయితే దానికి కూడ ఆక్రమణ కింద కొంత నగదు చెల్లించాల్సి ఉంటుంది. అదే సొంత భవనాలు, స్థలాల్లో అయితే బోర్డు సైజును బట్టి నగదు వసూలు చేస్తారు. వీరందరు ప్రతి ఏడాది మున్సిపాలిటీకి ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది.

తెనాలి పట్టణంలో 261 బోర్డులు

తెనాలి పట్టణంలో 24 యాడ్ ఏజెన్సీలకు చెందిన 261 బోర్డులు ఉన్నాయి. వీటిని పట్టణంలో ప్రధాన రహదారులు, కూడలిల్లో ఏర్పాటు చేశారు. వీటి ద్వారా మున్సిపాలిటీకి ఏడాదికి సుమారు రూ.17లక్షల ఆదాయం సమకూరుతుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.12లక్షల నగదును యాడ్ ఏజెన్సీల నిర్వాహకులు చెల్లించారు. మిగిలిన నగదు మార్చిలోపు చెల్లించాల్సి ఉంది.

అనధికార ఫ్లెక్సీలే అధికం...

తెనాలి పట్టణంలో అనుమతులు తీసుకున్న యాడ్ ఏజెన్సీ బోర్డుల కంటే అనధికార ఫ్లెక్సీలే ఎక్కువని చెప్పవచ్చు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, గంగానమ్మపేట వంతెన, మార్కెట్ ఏరియా, కొత్త వంతెన, చెంచుపేట, వాహబ్‌చౌక్, మారీసుపేట, అయితానగర్, బుర్రిపాలెం రోడ్డు, చినరావూరు, రామలింగేశ్వరపేట తదితర ప్రాంతాలలో వీటిని ఎక్కువగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేశారు. ఇదిఇలా ఉంటే మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న మార్కెట్ భవనానికి కూడ పెద్ద పెద్ద ఫ్లెక్సీలను కొందరు ఏర్పాటు చేసిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిచ్చింది.

పట్టించుకోని అధికారులు... కోల్పోతున్న ఆదాయం

పాలకులు, మున్సిపల్ అధికారులకు గుర్తు వచ్చినప్పుడు అనధికార ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తుంటారు. కానీ ఆచరణలో వాటి తొలగింపు జరగదు. దీంతో ఎక్కువగా అధికార పార్టీ నాయకులు పట్టణంలోని ప్రధాన రహదారులపై నేటికీ ఏర్పాటు చేస్తునే ఉన్నారు. దీనివల్ల మున్సిపల్ ఆదాయానికి గండి పడుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే అనధికార ఫ్లెక్సీలను తొలగించటంతో పాటు మున్సిపాలిటీకి ఆదాయం సమకూరే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొద్దిరోజుల్లో అనధికార ఫ్లెక్సీలను తొలగిస్తాం..



తెనాలి పట్టణంలో అనధికార ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్‌లు ఉన్న మాట వాస్తవం.. వీటిని తొలగించాలని ఇప్పటికే కోరటం జరిగింది. కొద్దిరోజుల్లో వీటిని పూర్తిగా తొలగిస్తాం. ప్రధాన రహదారులు, డివైడర్లపై వీటిని ఎవరు ఏర్పాటు చేయవద్దు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారులు అందరు సహకరించాలి. ఎవరైన ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని భావిస్తే మమ్మల్ని సంప్రదిస్తే అనుమతులు ఇస్తాం.

–బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

కళలు, కళారూపాలు లేకపోతే సమాజమే కాదు



విజేతలతో అతిథులు

నగరంపాలెం: కళలు, కళారూపాలు లేని సమాజం సమాజమే కాదని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అన్నారు. ఆదివారం లక్ష్మీపురం శ్రీత్యాగరాజస్వామి కళావేదికపై శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం 46వ వార్షికోత్సవ సందర్భంగా సంగీత మహోత్సవాలు నిర్వహించారు. సభకు సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ అధ్యక్షత వహించారు. జస్టిస్ శేషసాయి, అర్చక అకాడమీ పూర్వ డైరెక్టర్ డాక్టర్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి, సంస్థ అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాస్‌లు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. జస్టిస్ ఏవీ శేషసాయి మాట్లాడుతూ ఆధునికత పేరుతో మన సంప్రదాయ కళారూపాలను విస్మరిస్తున్నారని అన్నారు. అటువంటి సమయంలో జాగరూకత చాలా అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు తమ పిల్లలను సంప్రదాయబద్ధంగా ఉండేలా కాపాడుకోవాలని అన్నారు. ఏ జాతి సంస్కృతీ, సంప్రదాయాలను మర్చిపోతే, ఆ జాతి వినాశనమయ్యేందుకు కారణమని చెప్పారు. సభానంతరం కర్ణాటక సంగీత పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. సిక్కిల్ గురుచరణ్(చెన్నై) ఆధ్వర్యంలో నిర్వహించిన కర్ణాటక గాత్ర సంగీత కచేరి అలరించింది. సభలో సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్.గిరిజాశంకర్, వై.రాజ్యలక్ష్మి, ఫణితేజ పాల్గొన్నారు.

జల దిగ్బంధనంలో రాజధాని అమరావతి

- బాహ్య ప్రపంచంతో తెగిపోయిన సంబంధాలు
- అస్తవ్యస్తంగా మురుగునీటి పారుదల వ్యవస్థ
- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అజయ్ కుమార్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అజయ్ కుమార్

తాడికొండ: శిథిలావస్థకు చేరుకున్న వంతెనల స్థానంలో నూతన వంతెనల నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కంచుమాటి అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం తాడికొండ సినిమా హాల్ వద్ద ఏర్పాటు చేసిన శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెనలు పూర్తిగా మునిగిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిందన్నారు. రెండు రోజుల పాటు బాహ్య ప్రపంచానికి సంబంధం లేకుండా రాజధాని కేంద్రమైన తాడికొండ, తుళ్లూరు, అమరావతి మండలాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో అత్యవసరమైన లాం ఆనకట్ట వద్ద వంతెన, తాడికొండ- కంతేరు మధ్య ఎర్ర వాగులకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు గండ్లు పూడ్చి మరమ్మతులు చేయాలని, రైతులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు కూడా పంట నష్ట పరిహారం చెల్లించాలన్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థను నిర్మించి, నిల్వలు లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, నాయకులు ఇమ్మడి రామారావు, మానవ భద్రయ్య, నాగేశ్వరరావు, సరస్వతి, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయకండి

డాక్టర్ సురేష్ కుమార్



మాట్లాడుతున్న టి.ధనుంజయరెడ్డి

గుంటూరు మెడికల్: మానసిక సమస్యలు ఏ వయస్సు వారికైనా రావచ్చనని, తొలి దశలోనే గుర్తించి వైద్యుని సంప్రదించడం ద్వారా మందులు లేకుండానే, సమస్యల్ని కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు, కాటూరి వైద్య కళాశాల సైకియాట్రి విభాగాధిపతి డాక్టర్ కే సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక బ్రాడీపేటలోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన మానసిక సమస్యల ఉచిత వైద్య సలహా శిబిరం, అవగాహన సభలో డాక్టర్ కె. సురేష్ కుమార్ పాల్గొన్నారు. సభకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజ పరిస్థితులు, జీవన విధానంలో, ఆహారంలో వచ్చిన మార్పులు, వృత్తిపరమైన మానసిక ఒత్తిడి, ఆందోళనలు మానసిక సమస్యలకు కారణమవుతున్నాయన్నారు. ఇవి మానసిక వ్యాధులు కావన్నారు. కానీ వీటిని నిరోధించకపోతే, వీటివల్ల ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. మానసిక వ్యాధులతో పాటు బిపి, షుగర్లకు కారణమవుతున్నాయి అన్నారు. వీటిని తొలి దశలోనే గుర్తించి మానసిక వైద్య నిపుణులను సంప్రదించడం తగ్గించుకోవచ్చన్నారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్, టి.ధనుంజయ రెడ్డి మాట్లాడారు. ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మలా రాణి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కె.ఆనందరావు పాల్గొన్నారు.

కార్మెల్ మాతకు భక్తుల పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై నున్న కార్మెల్ మాతను ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయాన్నే కర్నూలు, ఆళ్లగడ్డ, నంద్యాల, ధర్మవరం ప్రాంతాల నుంచి బస్సులు, రైళ్లలో భక్తులు తరలి వచ్చారు. బాల ఏసు దేవాలయంలో ఉదయం దివ్యపూజాబలి కార్యక్రమంలో పాల్గొని, కొండను ఎక్కారు. తల నీలాలు సమర్పించి, కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

19న అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం అడ్డరోడ్డు వద్దనున్న అభయాంజనేయస్వామి ఆలయ ఆరో వార్షికోత్సవం ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు కోడూరి మల్లికార్జునరావు, రామకోటేశ్వరరావు ఆదివారం సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయాన్నే స్వామివారికి వైఖానస ఆగమం ప్రకారం వేద పండితులు పంచామృత స్నపన, విశేష అలంకారం, నాగవల్లీ సహస్త్ర నామ పూజలు నిర్వహిస్తారని చెప్పారు. సీతారామాంజనేయ భక్త సమాజం హనుమాన్ చాలీసా పారాయణం చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

తాడేపల్లిలో ఇసుక మాఫియా



మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్ : కార్మికులకు ఉపాధి కల్పించేందుకు, ప్రజలకు ఇసుక అందుబాటులోకి తెచ్చేందుకు ప్రాతూరు ఇసుక క్వారీని తెరిపించి పనులు కల్పించాలని సీపీఎం సీనియర్ నాయకుడు జొన్నా శివశంకరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరులో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో నూతన ఇసుక విధానాన్ని తీసుకు వచ్చి ఉచితంగా ఇసుకను ప్రజలకు అందజేస్తామని హామీ ఇచ్చిందన్నారు. 2004 లో ప్రాతూరు ఇసుక క్వారీ మూతపడడంతో సుమారు 400 కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లి మండలంలో ఇసుక మాఫియా అక్రమంగా క్వారీల నుంచి ఇసుకను తీసి, అమ్ముకుంటోందన్నారు. తక్షణమే ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తెచ్చి భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ట్రిబ్యునల్ కోర్టు తీర్పు ఆధారంగా భూగర్భ జలాలు ఇంకిపోకుండా, కార్మికులతోనే క్వారీలలో పని చేయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం నూతనశాఖ కార్యదర్శిగా దోకిపర్తి రాజేంద్రబాబును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ నాయకులు దోకిపర్తి కోటయ్య, తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, గ్రామ సీపీఎం నాయకులు దాసరి సురేష్ పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

తాడికొండ:మద్యం సేవించిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మృతి చెందిన ఘటన తుళ్లూరు అయ్యన్న చెరువు ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సూరపు రామకృష్ణ (36) అనే వ్యక్తి కొంత కాలంగా తుళ్లూరు మండల పరిధిలో స్లాబ్ కాంక్రీట్ పనులు చేస్తూ.. అక్కడే నివాసం ఉంటున్నాడు. 12న మద్యం సేవించి అయ్యన్న చెరువులో ప్రమాదవ శాత్తు జారిపడి మునిగిపోయాడు. స్థానికులు కాపాడేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. మేస్త్రీ బురుసు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

వంట నూనె విక్రయ కేంద్రం ప్రారంభం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ రైతు బజారులో శనివారం వంట నూనెల విక్రయ కేంద్రాన్ని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ ప్రారంభించారు. వంట నూనెల ధరలు పెరిగిపోయిన నేపథ్యంలో తక్కువ ధరకే వంట నూనెలు వినియోగదారులకు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేర్కొన్నారు.

19న 'ఎర్ర చెరువును కాపాడుకుందాం'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రజక సంఘ నాయకులు

నెహ్రూనగర్: గుంటూరు టౌన్ రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19న ఎర్ర చెరువును కాపాడుకుందాం అనే అంశంపై బహిరంగ సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం పాతగుంటూరులో బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత గుంటూరులోని గంగానమ్మ కమ్యూనిటీ హాల్‌లో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొంత మంది ఎర్రచెరువు పేరుతో స్వార్థంగా సంఘాలు సృష్టించి, దాని చుట్టూ ఆక్రమించుకుని చెరువును కూడా తమ ఆధీనంలోకి తీసుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. బహిరంగ సభకు రజకులంతా హాజరై ఎర్రచెరువును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు సాంబయ్య, రమాదేవి, వెంకటేశ్వర్లు, వీరాస్వామి పాల్గొన్నారు.

ఇండియా పోస్ట్ 5కే రన్



లక్ష్మీపురం: గుంటూరులో తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఇండియా పోస్ట్ రన్ – 2024 కార్యక్రమంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ప్రజా ప్రతినిధులతో కలసి 5 కే రన్ లో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నగరంలో పారిశుద్ధ్య పనుల తనిఖీ నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో డ్రెయిన్లపై, రోడ్ల మీద ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ ఉన్నారు.